క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

రాజాపూర్: కృత్రిమ ఇసుకను తయారు చేసేందుకు మట్టి తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. రాజాపూర్ ఎస్ఐ రవి కథనం ప్రకారం.. శనివారం మధ్యరాత్రి సమయంలో కానిస్టేబుళ్లు జే. శంకర్, వెంకట్‌రాములు మండల పరిధిలోని కుత్నేపల్లి గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో మట్టిలోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఆపి విచారించారు. కాగా ఎలాంటి అనుమతి లేకపోవడం, కృత్రిమ ఇసుక తయారీకి మట్టిని తరలిస్తున్నట్లు తేలడంతో ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్‌తో పాటు స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు ఆదివారం కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బాలానగర్‌లో ఇసుక టిప్పర్ ..

బాలానగర్: అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను మండలకేంద్రంలో పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ఎస్ఐ తిరుపాజీ కథనం మేరకు.. చెన్నవెళ్లికి చెందిన వారు జడ్చర్ల మండల పరిధిలోని ఉదండాపూర్ పరిసరాల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు లతీఫ్, టిప్పర్‌ను నడుపుతున్న నాగరాజుపై కేసునమోదు చేశారు.

కోఆర్డినేటర్‌గా బ్యాగరి వెంకటస్వామి



మహబూబ్‌నగర్ రూరల్: తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర కోఆర్డినేటర్‌గా బోయపల్లికి చెందిన బ్యాగరి వెంకటస్వామి నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ నియామక పత్రం అందజేశారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ సర్పంచ్

నవాబుపేట: మండల పరిధిలోని పోమాల్ మాజీ సర్పంచ్ కృష్ణ ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య ఆధ్వర్యంలో ఎంపీ అభ్యర్థి వంశీచంద్ రెడ్డి సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. గతంలో సర్పంచ్‌గా కొనసాగుతున్న తరుణంలోనే అవినీతి ఆరోపణలతో సస్పెండ్‌కు గురైన ఆయన అప్పటి నుంచి బీఆర్ఎస్ దూరంగా ఉంటూ వస్తున్నాడు.

ఎంపీటీసీ సభ్యురాలికి పరామర్శ

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): నవాబ్‌పేట్ మండలం అమ్మాపూర్ ఎంపీటీసీ సభ్యురాలు భాగ్య త్వరగా కోలుకోవాలని ఎంపీటీసీల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ అన్నారు. అనారోగ్యంతో జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను ఆదివారం పరామర్శించారు.

బీజేపీలోకి నాయకులు

పాలమూరు: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి చెందిన తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మెట్టుకాడి శ్రీనివాసులు, 18వ వార్డు కౌన్సిలర్ కిషోర్‌కుమార్ ఆదివారం హైదరాబాద్‌లో రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. బీజేపీ అభ్యర్థి డీకే అరుణ తదితరులు పాల్గొన్నారు.

కాముడి దహనం

బాలానగర్: మండల కేంద్రంతోపాటు మోతీ ఘణాపూర్, ఉడిత్యాల, నేరళ్లపల్లి, పెద్దరేవల్లి, హేమాజీపూర్, చిన్నరేవల్లి, తిరుమలగిరిలతో పాటు అన్ని గ్రామాల్లో కాముడి దహనం కార్యక్రమం ఆదివారం రాత్రి నిర్వహించారు. పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మలుపు



మద్దూరు: మద్దూరు నుంచి పెదిరిపాడ్ మీదుగా నారాయణపేట వెళ్లే రోడ్డులో పెదిరిపాడ్ చెరువు కట్ట వద్ద ఉన్న మలుపు ఉండటంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. ఈ రోడ్డు గతంలో మోటల్‌రోడ్డు ఉండేది. 11ఏళ్ల క్రితం ఆర్‌అండ్‌బీ నిధులతో ఈ రోడ్డును బీటీగా మార్చారు. నారాయణపేటకు వెళ్లేందుకు దూరం తగ్గుతుండడంతో ఈ దారిలో వెళ్లేందుకు వాహనదారులు మొగ్గుచూపుతున్నారు. ఈ రోడ్డు మలుపు వద్ద ప్రమాద సూచికలు, స్పీడ్ బ్రేక్‌లు ఏర్పాటు చేయకపోవడంతో తరుచు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి ప్రమాద హెచ్చరిక బోర్డులు, కల్వర్టు వద్ద ఇనుప కడ్డీలు ఏర్పాటుచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అసంపూర్తిగా నిర్మాణాలు



వెన్నాచేడ్‌లో అంగన్‌వాడీ కేంద్రంలో పశువైద్యశాల

- సమకూరని పక్కా భవనాలు
- అంగన్‌వాడీ, పాఠశాల భవనాల్లో పశువైద్య కేంద్రాలు
- పట్టించుకోని అధికారులు

గండేడ్: మండల పరిధిలో పశువైద్య కేంద్రాలకు ఏళ్లుగా పక్కా భవనాలను సమకూర్చక పోవడంతో పూర్తిస్థాయిలో సేవలు అందించేందుకు విఘాతం కలుగుతోంది. దీంతో పాడి రైతులు తమ పశువులకు చికిత్స చేయించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. పాత భవనాలు శిథిలావస్థకు చేరడంతో అంగన్‌వాడీ, పాఠశాల భవనాల్లో కేంద్రాలను కొనసాగిస్తున్నారని దీంతో సేవలు సరిగా అందించడం లేదని వాపోతున్నారు. మండల పరిధిలో 27 గ్రామపంచాయతీలు ఉండగా 4141 ఆవులు, ఎద్దులు, 4370 బర్రెలు , దున్నలు, 39,705 గొర్రెలు, 8,481మేకలు ఉన్నాయి. వీటికి సేవలు అందించేందుకు రెండు పశువైద్య కేంద్రాలు, రెండు రూరల్ లైవ్ స్టాక్ యూనిట్లు ఉన్నాయి. గండేడ్, బల్సూర్‌గొండ పశువైద కేంద్రాలకు పక్కా భవనాలు ఉండగా వెన్నాచేడ్, పెద్దవార్వాల్ కేంద్రాలకు నేటికి పక్కా భవనాలు సమకూర్చలేదు.

ఎపుడు కూలుతుందో తెలియదు.

వెన్నాచేడ్ పశువైద్యశాల భవనం యాభై ఏళ్ల క్రితం నిర్మించారు. కాగా ఇది పదిహేనేళ్లుగా శిథిలావస్థకు చేరుతోంది. చినుకు పడితే లోపలంతా చిత్తడిగా మారుతోంది. పైకప్పు నుంచి పెచ్చులుడి పడుతున్నాయి. పశుగ్రాస విత్తనాలు, మందులు కూడా దాచే పరిస్థితి లేదు. విషయంపై ఎన్నిసార్లు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఏడాదిన్నర క్రితం అది పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో అక్కడి నుంచి అంగన్‌వాడీ భవనంలోకి మార్చారు. ఇది రోడ్డుపై ఉండడం వల్ల పశువులకు చికిత్సలు అందించే సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వెన్నాచేడ్, జిన్నారం, చెల్మిల్లా, జక్లపల్లి, లింగాయిపల్లి, కప్లాపూర్, గోవింద్‌పల్లి, బైస్‌పల్లి గ్రామాలన్ని వెన్నాచేడ్ కేంద్రం కిందికే వస్తాయి. అయితే సేవలు సరిగా అందించే పరిస్థితి లేకపోవడంతో పాడిరైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

అర్ధాంతరంగా ఆగిన నిర్మాణాలు

వెన్నాచేడ్ పశువైద్యశాల పక్కా భవననిర్మాణానికి గాను రూర్బన్ పథకం కింద 2018 సంవత్సరంలో నిధులు మంజూరు అయ్యాయి. పెద్దవార్వాల్ , వెన్నాచేడ్ పక్కా భవన నిర్మాణానికి గాను రూ. 12 లక్షల రూపాయల చొప్పున నిధులు మంజూరు చేశారు. దీంతో వెంటనే పనులు ప్రారంభించారు. కానీ రెండూ ఇప్పటికీ అసంపూర్తిగానే ఆగిపోయాయి. పెద్దవార్వాల్‌లో పాఠశాల భవనంలో కొనసాగుతున్నది. కాగ ఆగిన నిర్మాణాలను తక్షణమే పూర్తి చేసి ఇబ్బందులు తొలగించాలని గ్రామీణులు కోరుతున్నారు.



నిర్మాణ దశలో ఆగిపోయిన పశువైద్య కేంద్రం

మొర పెట్టుకున్నా ఫలితం లేదు..



వెన్నాచేడ్‌కు చుట్టు పక్కల ఏడెనిమిది గ్రామాల వారు పశువైద్యం కోసం వస్తుంటారు. ఉన్న పక్కా భవనం శిథిలం కావడంతో.. సేవలకు ఇబ్బందులు కలగకూడదని తాత్కాలికంగా అంగన్‌వాడీ కేంద్రంలోకి మార్చాం. నిర్మాణంలో ఉన్న పక్కా భవనాన్ని త్వరగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. ఇప్పుడేమో నిధులు లేవని వదిలేశారు.

– గంగుల పుల్లారెడ్డి, మాజీ సర్పంచ్ వెన్నాచేడ్

రూర్బన్ స్కీ ప్రస్తుతం లేదు

పెద్దవార్వాల్, వెన్నాచేడ్ పశువైద కేంద్రాల నిర్మాణానికి అప్పట్లో రూర్బన్ స్కీం కింద రూ. 12లక్షల చొప్పున నిధులు మంజూరు అయ్యాయి. లెంటల్ లేవల్ వరకు నిర్మాణం వేగంగా జరిగినా తర్వాత ఆగిపోయింది. చాలాసార్లు కాంట్రాక్టర్లకు నిర్మాణం పూర్తి చేయాలని కోరినా వారు స్పందించలేదు. వారి గడువు ముగిసింది. రూర్బన్ స్కీం కూడా ముగిసింది. ఇపుడు తిరిగి నిర్మాణం చేపట్టాలంటే ఢిల్లీ నుంచి అనుమతులు రావాలి. లేదంటే ఇతర నిధుల నుంచి ప్రతిపాదనలు పెట్టి అసంపూర్తి నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉంటుంది.

– రాబర్టు, ఏఈ, గండేడ్

ప్రతి హామీ నెరవేరుస్తాం



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నేరవేరుస్తుందని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం వెంకటాయపల్లి గ్రామంలో బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలలో మహిళలకు ఉచిత బస్సు, ఆరోగ్యశ్రీ కింద రూ. 10 లక్షల వైద్య సేవలు అమలు చేశారని వివరించారు. గత నెల 27 న రూ. 500 లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలు అమలు చేశారని తెలిపారు. అయిదవ గ్యారంటీ అయిన పేద మధ్య తరగతి ప్రజల సొంతింటి కల అయిన ఇందిరమ్మ ఇండ్ల పథకానికి భద్రాద్రి శ్రీరాముల వారి సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారని తెలిపారు. త్వరలో రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీని ఆదరించి ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో మాజీ ఎంపీపీ భారతిరెడ్డి, నాయకులు వీరేష్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంజల్‌రెడ్డి, కొకుంట్ల అధ్యక్షులు రాఘవేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మాజీ వైస్ ఎంపీపీ చేరిక...

వెంకటాయపల్లి గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ, మాజీ సర్పంచ్ రంగయ్యగౌడ్ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముదిరాజ్ సంఘం అధ్యక్షులు నక్కరఘు, నాయకులు విశ్వేశ్వర్‌రెడ్డి, శివయాదవ్, చెన్నయ్య, బాలరాజు, ఆంజనేయులుతో పాటు మరో 200 మంది సైతం పార్టీ తీర్థ పుచ్చుకున్నారు.

ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి



ఆరోగ్య పరీక్షలు చేస్తున్న హెల్త్ కేర్ వైద్య బృందం

గండేడ్: ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండడం ముఖ్యమని సీఎస్‌సీ హెల్త్ కేర్ డైరెక్ట్ కో ఆర్డినేటర్ విష్ణువర్ధన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో లేబర్‌కార్డు ఉన్న వారికి సీఎస్‌సీ హెల్త్ కేర్ బృందం ఆధ్వర్యంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కచ్చితంగా ప్రతి ఒక్కరు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రస్తుతం ఆరోగ్యంగా ఉండడం కన్నా మించిన ఆస్తి లేదన్నారు. కార్యక్రమంలో అనిల్, జయసుధ, ప్రవీన్, రాజేష్, వెంకటేశ్, నరేష్, నరేందర్ పాల్గొన్నారు.

వాసవీమాత ఆలయాల సందర్శన



పూజలు చేస్తున్న దేవరకద్ర ఆర్యవైశ్య మహిళలు

దేవరకద్ర: మండల కేంద్రానికి చెందిన ఆర్యవైశ్య మహిళా సంఘం ప్రతినిధులు ఆదివారం జిల్లాలోని వివిధ ప్రాంతాలలో ఉన్న వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయాలను సందర్శించారు. కొడంగల్ పట్టణంలోని వాసవీమాత దేవాలయం, వెంకటేశ్వరస్వామి దేవాలయం, మద్దూర్, దామరగిద్ద, నారాయణపేట, కోటకొండ, మక్తల్, మరికల్ పట్టణాలలోని వాసవీమాత ఆలయాలను వారు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షురాలు మంజుల రాణి, కోశాధికారి సరిత, సంఘం ప్రతినిధులు కవిత, సౌమ్య, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ఠ



పూజల్లో పాల్గొన్న భక్తులు

బాలానగర్: మండల పరిధిలోని పెద్దరేవల్లి గ్రామం శివారులోని గుట్టపై తిరుమలనాథ స్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ, శ్రీదేవి మాత విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. ఆలయ కమిటీ చైర్మన్ సాదు వెంకట్ రెడ్డి ఈసందర్భంగా మాట్లాడారు. నాలుగు రోజుల పాటు వేడుకలు జరుగుతాయని వివరించారు. మొదటి రోజు ఆదివారం వాస్తు హోమం, వాస్తు ఆరాధన తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

ఓబీసీ విభాగాన్ని పటిష్టం చేయాలి



పట్టణ ఓబీసీ కార్యవర్గంతో నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ ఓబీసీ విభాగాన్ని మరింత పటిష్టం చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం ఓబీసీ విభాగం పట్టణ అధ్యక్షులు బండి మల్లేష్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సంజీవ్ ముదిరాజ్ మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి గెలుపే ధ్యేయంగా పని చేయాలని కోరారు. పట్టణ కాంగ్రెస్ ఓబీసీ ప్రధాన కార్యదర్శిగా పాతూరు కుమార్, ఉపాధ్యక్షుడిగా ఆనంద్‌కుమార్, నర్సింలు, శ్రీను, సిద్ధులను నియమించారు. అదే విధంగా పలువురిని కార్యనిర్వాహక కార్యదర్శులుగా, వార్డు ఇన్‌చార్జీలు నియమించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు చంద్రకుమార్‌గౌడ్, సీనియర్ నాయకులు ఎన్పీ.వెంకటేశ్, ఓబీసీ పట్టణ అధ్యక్షుడు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు బాగు చేయించండి సారూ!

నవాబుపేట: ప్రజా పాలన అంటే ఇదే.. ఒక మారుమూల గ్రామానికి చెందిన వారు ఎవరి ప్రమేయం లేకుండా సీఎంను కలిసి తమ సమస్యలు వివరించే స్వేచ్ఛ కల్పించిన ప్రభుత్వం తమది అని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. ఆదివారం దొడ్డిపల్లి గ్రామస్తులు నేరుగా ఆయనను కలిసి తమ సమస్యలు తెలుపుతున్న సందర్భంగా ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

కాగా తమ గ్రామానికి మండల కేంద్రం నుంచి వచ్చే రోడ్డు గుంతలమయంగా ఉందని బాగు చేయించాలని గ్రామస్తులు సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయనను ఇంట్లో కలిసి వినతి పత్రం అందించారు. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికి సైతం సమస్యలు వివరించారు. అనంతయ్య, లక్ష్మయ్య, నర్సింహరెడ్డి, తిరుపతయ్య, వడ్డెరాములు, ఖలీల్, ఖాజా వెంకట్‌రెడ్డి ఉన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డితో దొడ్డిపల్లి గ్రామస్తులు

ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు

బాలానగర్: కాంగ్రెస్ యువజన రాష్ట్ర నాయకులు నేనావత్ మోహన్ నాయక్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లో ఈ మేరకు సీఎంను కలిసినట్లు ఆయన వివరించారు.

మైసమ్మ చెంత జన జాతర





నవాబుపేట: మండల పరిధిలోని మైసమ్మ ఆలయ పరిసరాలు ఆదివారం జనసంద్రంగా మారాయి. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాలతో ఊరేగింపు చేశారు. ఆదివారం పైగా వేసవి కాలం కావటంతో జనం అడవిలో గడుపుతూ సేదతీరారు.

మిడ్జిల్‌లో ఇఫ్తార్



మిడ్జిల్: మండల కేంద్రంలోని మసీద్‌లో ఆదివారం సాయంత్రం మిడ్జిల్ ఎంపీటీసీ గౌస్ ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలకు ఎమ్మెల్యే సోదరుడు దుశ్యంత్‌రెడ్డి పండ్లు తినిపించారు. నాయకులు అల్వాల్‌రెడ్డి, సంపత్, మల్లికార్జున్‌రెడ్డి, జహంగీర్, హకీమ్, మహబూబ్, నిస్సార్, తదితరులు పాల్గొన్నారు.

నేడు అయ్యప్పకొండపై మహాపడిపూజ



మహమ్మదాబాద్: అయ్యప్పస్వామి జన్మదినాన్ని పురస్కరించుకుని నేడు సోమవారం మహమ్మదాబాద్ మండల కేంద్రంలోని కాంతిమల శిఖరంపై మహాపడిపూజ నిర్వహించనున్నట్లు గురుస్వాములు శ్రీనివాస్, రాజు, పూజారి వినోద్ తెలిపారు. ఉదయం గణపతి, కుమారస్వామి ,అయ్యప్ప స్వామి అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం 11గంటలకు స్వామివారి మహాపడిని వెలిగించనున్నట్లు వారు తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదములు అన్నప్రసాదం అందిస్తామని వివరించారు.

ఘనంగా మట్టల వేడుకలు



జిల్లాకేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని కల్వరి మెన్నోనైట్ బ్రదరన్ చర్చి కౌన్సిల్ ఆధ్వర్యంలో పాం సండే (మట్టల ఆదివారం) వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులు ఈతమట్టలతో ఊరేగింపు శాంతి ర్యాలీ నిర్వహించారు. ముందుగా కల్వరి చర్చి ప్రధాన ద్వార నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీని పాత బస్టాండ్, క్లాక్‌టవర్, అశోక్‌టాకీస్ చౌరస్తా, ఆర్టీసీ బస్టాండ్, తెలంగాణ చౌరస్తా మీదుగా క్రీస్తు గీతాలు ఆలపిస్తూ కొనసాగించారు. భారీ సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు. ఎంబీ చర్చి చైర్మన్, సీనియర్ పాస్టర్ రెవరెండ్ ఎస్.వరప్రసాద్, వైస్ చైర్మన్ బీఎ.జేకబ్, కార్యదర్శి జేఎ.డేవిడ్, కోశాధికారి టీఏ.స్టీవెన్, సహా కోశాధికారి టైటస్ రాజేందర్, సంఘ కార్యవర్గం పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: పట్టణంలో మట్టల ఆదివారం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మట్టలతో ఊరేగింపు చేపట్టారు. కార్యక్రమంలో సంఘ కాపరి రెవ.కె. విలయం బూత్, సంఘ అధ్యక్షుడు జి.సి ఫిలమోన్, కార్యదర్శి తిమోతి, సభ్యులు ఐజక్, లాజరస్, బెంజిమెన్, సండేస్కూల్ సూపరింటెండెంట్ సౌమ్యసుశాంత్, ఉపాధ్యాయులు నవరత్నకుమారి, సూర్యకుమారి, శారా, హిమారాణి, శ్రేష్ఠ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.



జడ్చర్లలో..

నూతన కార్యవర్గం ఎన్నిక

మహబూబ్‌నగర్ రూరల్: దివిటిపల్లిలో నూతనంగా నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్ల కాలనీలో అభివృద్ధి పోరాట వేదిక నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా సురేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కడియాల మోహన్‌లు ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగ తాటికొండ రాములు, ఉపాధ్యక్షులుగా అంబదాస్, వర్ద గాలన్న, రాజ్‌కుమార్, సహాయ కార్యదర్శులుగా గద్దమీది గోపాల్, ప్రశాంత్, వెంకటేష్ గుప్తా, యాదగిరి, సలహాదారులుగా నల్లవెల్లి కురుమూర్తి, కేశవులు, రామ్మోహన్, రాఘవేందర్‌గౌడ్, కోశాధికారిగా రవిశంకర్, ఉప కోశాధికారిగా వాజేందర్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. రాఘవేందర్‌యాదవ్, ఆది విష్ణువర్ధన్, నరేష్, యాదయ్య, సంజయ్‌కుమార్, భానుప్రసాద్, జహంగీర్, నవాబ్‌ఖాన్, శశి, ఆనంద్ పాల్గొన్నారు.

బలవంతంగా రంగులు వేయొద్దు

నారాయణపేట రూరల్: హోలీ పండుగను ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని, బలవంతంగా ఎవరిపైనా రంగులు చల్లొద్దని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. పట్టణం, మండలంలోని గ్రామాల్లో ఇతరులకు ఇబ్బందులు కల్గించేవిధంగా, మహిళలపై అసభ్యంగా వ్యవహరిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. బలవంతంగా డబ్బులు వసూలు చేయడం, వీధుల్లో ఇష్టారీతిగా బండలు, కుండలు వంటి వస్తువులు పగలగొట్టడం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రసాయనాలతో కాకుండా ప్రకృతి సిద్ధంగా లభించే రంగులతో హోలీ జరుపుకోవాలన్నారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని గ్రామాలు, పట్టణాల్లో పోలీసు పెట్రోలింగ్ కొనసాగుతుందని.. తనిఖీలు కొనసాగుతాయన్నారు.